నిరుపయోగంగా చేపల మార్కెట్



రూ.50 లక్షలతో నిర్మించిన చేపల మార్కెట్



రోడ్డు పక్కన చేపల అమ్మకాలు చేస్తున్న వైనం

- రోడ్డుపైనే చేపల అమ్మకాలు
- దీంతో అపరిశుభ్ర వాతావరణం
- పట్టించుకోని పాలకులు

ముత్తుకూరు : ముత్తుకూరులో ఆరు నెలల క్రితం నిర్మించిన చేపలు–చికెన్ మార్కెట్ నిరుపయోగంగా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వినియోగదారులకు శుభ్రమైన చేపలు–మాంసం ఉత్పత్తులు అందజేయాలన్న సంకల్పంతో రూ.50 లక్షలతో సర్వాంగ సుందరంగా ఈ మార్కెట్‌ను నిర్మించారు. మత్స్యకారుల చిరకాల కోరిక మేరకు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నాటి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ మార్కెట్ నిర్మించి, ప్రారంభించారు.

చేపల వ్యర్థాలతో ఇబ్బందులు

ముత్తుకూరులో రోడ్డుపై చేపలు, చికెన్ అమ్మకాలు చేస్తున్న వ్యాపారులను కొత్తగా నిర్మించిన మార్కెట్‌కు తరలించాలని, తద్వారా గ్రామ నడిబొడ్డు ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచాలని అప్పట్లో నిర్ణయించారు. టెండర్ల ద్వారా మార్కెట్‌లోని గదులను కేటాయించాలని సంకల్పించి, ఆ మేరకు ప్రక్రియ చేపట్టారు. ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో ఈ ప్రయత్నానికి బ్రేక్ పడింది. ప్రస్తుతం గ్రామ శివారులో రోడ్డుపై చేపల అమ్మకాలు సాగుతున్నాయి. మట్టిలో కూర్చుని అమ్మకాలు సాగించే వ్యాపారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా చేపల వ్యర్థాలతో పరిసర ప్రాంతాలు కలుషితమవుతున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా చేపల కొనుగోలుదారులు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంలోనైనా చేపల మార్కెట్‌కు మోక్షం లభిస్తుందేమోనని వ్యాపారులు, కొనుగోలుదారులు ఆశిస్తున్నారు.

క్లుప్తంగా

ఉచిత వైద్యసేవలు



మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రొట్టెల పండగకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇక్కట్లు తలెత్తకుండా బారాషహీద్ దర్గా ప్రాంగణంలో వైద్యశిబిరాలను పలు ఆస్పత్రుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఉచిత రక్త పరీక్షలతో పాటు పలు పరీక్షలు చేశారు. నగరంలోని ఎనెల్, కిమ్స్, మెడికవర్, యశోధర, ప్రభుత్వ యునానీ వైద్యశాల తదితరులు స్టాళ్లను ఏర్పాటు చేసి సేవలను అందించారు.

దర్గాలో ఏర్పాట్ల పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న శర్మద

నెల్లూరు(బారకాసు): బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగకు సంబంధించిన ఏర్పాట్లను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద సూచించారు. ఏర్పాట్లను బుధవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. మంచినీటి సదుపాయం, పారిశుధ్య నిర్వహణ, టాయ్‌లెట్లు, రిసెప్షన్ సెంటర్, సీసీ కెమెరాలు, పార్కింగ్, మైక్ అనౌన్స్‌మెంట్, ఘాట్ ప్రాంతంలో షవర్లు, రొట్టెలు మార్చుకునే ప్రాంతంలో వసతులపై పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు



స్టాళ్లను పరిశీలిస్తున్న వెంకటరమణ

నెల్లూరు(బారకాసు): రొట్టెల పండగ సందర్భంగా బారాషహీద్ దర్గా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల్లో నిర్దేశిత ప్రమాణాలను తప్పక పాటించాలని, లేని పక్షంలో దుకాణాలను మూసేయిస్తామని ఎంహెచ్ఓ వెంకటరమణ స్పష్టం చేశారు. దర్గా ప్రాంగణంలోని వివిధ ఆహార స్టాళ్లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. నాణ్యత ప్రమాణాలను పాటించని నాలుగు ఆహారశాలలను మూయించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి



నెల్లూరు(బారకాసు): బారాషహీద్ దర్గా వద్ద భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పించామని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని జేసీ సేదు మాధవన్ ఆదేశించారు. రొట్టెల పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన టాయ్‌లెట్లు, పోలీస్ కంట్రోల్ రూమ్ తదితరాలను బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. దర్గా ప్రాంగణంలో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని సూచించారు. అదనపు కమిషనర్ శర్మద, ఎస్ఈ సంపత్ కుమార్, ఎంహెచ్ఓ వెంకటరమణ, సిటీ ప్లానర్ దేవీకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయకపోవడం దారుణం

నెల్లూరు(బారకాసు): ఫోర్జరీ వ్యవహారానికి సంబంధించి ఫిర్యాదు చేసి నెలన్నరైనా నేటికీ ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయకపోవడం దురదృష్టకరమని న్యాయవాది కాకు మురళీ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. కమిషనర్ ప్రాథమిక విచారణ చేసి, చర్యలు చేపట్టాలని ఎస్పీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్‌ను నేటికీ నమోదు చేయకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. కుంభకోణాలపై అలసత్వం వహించడం సరికాదని ప్రభుత్వానికి సూచించారు. అవినీతి ఆరోపణలతో సస్పెండైన అధికారులను విచారించి.. భాగస్వాములైన పలువురు నేతలు, కార్పొరేటర్ల పాత్ర ఏమిటో నిగ్గు తేల్చాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

నెల్లూరు సిటీ: కోడూరుపాడు గ్రామాభివృద్ధిని కొందరు అడ్డుకుంటున్నారని, ఇక్కడి పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తుంటే ఓర్వలేక అవాస్తవాలను వ్యాప్తి చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకాన్ని బుధవారం నిర్వహించారు. సతీష్, సుకుమార్, అములూరు సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి



ఏకలవ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

కోవూరు : కోవూరులోని స్టౌ బీడీ కాలనీలో ఏకలవ్య జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ మాట్లాడుతూ ఎరుకల కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఎరుకల కుటుంబాలకు అన్నిరకాల సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏకలవ్యుని చరిత్రను ఆదర్శంగా తీసుకుని నీతి, నిజాయతీతో ఎదగాలని ఆదివాసులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కట్టా చిరంజీవి, వెంకటేష్, సుబ్బరాయుడు, మస్తానయ్య, మల్లికార్జున, నరసయ్య, రాజా తదితరులు పాల్గొన్నారు. తొలుత ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కసుమూరులో భక్తుల సందడి



కసుమూరు దర్గాలో భక్తుల ప్రార్థనలు

వెంకటాచలం : దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన వెంకటాచలం మండలం కసుమూరులోని మస్తాన్‌వలీ దర్గా వద్ద బుధవారం భక్తుల సందడి నెలకొంది. నెల్లూరు నగరంలో బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండగ ప్రారంభం కావడంతో అక్కడకు వచ్చే భక్తుల్లో ఎక్కువ మంది కసుమూరు దర్గాను దర్శించుకోవడం ఆనవాయితీగా ఉంది. దీంతో బుధవారం సాయంత్రానికి కసుమూరులో భక్తుల సందడి మొదలైంది. ఈ క్రమంలో వారు మస్తాన్‌వలీ దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గురువుకు కన్నీటి నివాళి



సిద్ధయ్య భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కాకాణి

పొదలకూరు : తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుకు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం కన్నీటి నివాళులర్పించారు. పట్టణంలోని టీచర్స్‌కాలనీలో నివాసం ఉంటున్న విశ్రాంత ఉపాధ్యాయుడు సిద్ధయ్య వయస్సు పైబడి తుదిశ్వాస విడిచారు. సమాచారం తెలుసుకున్న కాకాణి కుటుంబసభ్యులతో హాజరై శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధయ్య మాస్టర్ అంటే తనకు ప్రత్యేక గౌరవం ఉందన్నారు. ఆయన మరణం తనకు తీరనిలోటుగా పేర్కొన్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కాకాణి వెంట ఎంపీటీసీ సభ్యురాలు జి.లక్ష్మీకల్యాణి, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, పార్టీ నేతలు మారు వెంకటరామిరెడ్డి, ఎస్కే అంజాద్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

దాడికి కారకులను అరెస్ట్ చేయాలి



మాట్లాడుతున్న ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజా

తోటపల్లిగూడూరు : కృష్ణపట్నం పోర్టులో డ్రైవర్లపై దాడి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలని ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మారుబోయిన రాజా డిమాండ్ చేశారు. మండలంలోని నరుకూరు సెంటర్‌లో ఉన్న సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ నాయకులు పోర్టు కార్మికులపై దాడులను ఖండిస్తూ బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ పోర్టులో పని చేసే ట్రక్కు డ్రైవర్లతో 12 గంటల పాటు నిరంతరం పనిచేయిస్తూ కేవలం రూ.14 వేలు వేతనం ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఇతర రాష్ట్రాల వారిని ఏమి చేసినా అడిగే వారు ఉండరని పోర్టు యాజమాన్యం దాడులకు దిగడం అన్యాయమన్నారు. ఇటీవల పోర్టులో పలువురు కార్మికులపై దాడి చేసిన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోర్టులో పెద్ద ఎత్తున నిరసనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాశిన పరుశురాం, గోపి, చిన్నారావు, వెంకట శేషయ్య, రమణయ్య బాబు, వెంకయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తాజియా



తాజియా (మాతం) చేస్తున్న ముస్లింలు

- రక్తం చిందించిన ముస్లింలు



చావిడిలో కొలువుదీర్చిన పీర్లు

మనుబోలు : మండలంలోని కాగితాలపూరు గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న మొహర్రం వేడుకల ముగింపు కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో ఉంచిన హజ్రత్ ఇమాం, హజ్రత్ అబ్బాస్‌ల పీర్లను ముస్తాబు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. విషాద చిహ్నంగా దర్గాలను నలుపురంగు కాగితాలతో అలంకరించారు. భారీ సంఖ్యలో ముస్లింలు దర్గా వద్ద చేసిన తాజియా(రెండు వేళ్ల మధ్య బ్లేడు ఉంచుకుని చాతీపై రక్తం వచ్చేలా కొట్టుకోవడం) చూపరులకు కంటతడి పెట్టించింది. ముగింపు ఉత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. కులమతాలకు అతీతంగా గ్రామస్తులు పీర్ల ఉత్సవాన్ని తిలకించడం విశేషం. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ 1346 సంవత్సరాల క్రితం సిరియాను ముస్లింల సంప్రదాయాలకు వ్యతిరేకంగా పరిపాలిస్తున్న ఎజీద్‌ను మహమ్మద్ ప్రవక్త రెండో మనుమడు హజ్రత్ ఇమామ్ హుస్సైన్ ఎదిరించారని తెలిపారు. దీంతో హజ్రత్ ఇమామ్‌ను చర్చలకు పిలిచిన ఎజీద్ ఇరాక్‌లోని కర్బలా మైదానంలో హజ్రత్, ఆయన కుటుంబ సభ్యులు 72 మందిని దారుణంగా చంపివేశాడని, నాటి ఘోర దుర్ఘటనకు విషాద చిహ్నంగా ముస్లింలు ఏటా మొహర్రం జరుపుకుంటారని తెలిపారు. అంజుమన్ హుస్సేని కమిటీ వారు, గ్రామ పెద్దలు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మైపాడు తీరంలో కోలాహలం

- పోటెత్తిన భక్తులు



ఇందుకూరుపేట : నెల్లూరులో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న రొట్టెల పండగకు వస్తున్న భక్తులు సముద్ర స్నానం నిమిత్తం బుధవారం మైపాడు బీచ్‌కు పోటెత్తారు. ఈ నేపథ్యంలో తీరంలో కోలాహలం నెలకొంది. భక్తులకు ఎలాంటి అవాంతరాలు లేకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా గజ ఈతగాళ్లను ఉంచారు. కాగా భక్తులు సముద్రంలో మరింత లోతుగా వెళ్లకుండా జాగ్రత్తలు వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీఓ సాయిలహరి మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు సముద్ర స్నానానికి వస్తున్న వారు నిబంధనలు పాటించాలని, తగిన ఏర్పాట్లు చేయించామని తెలియజేశారు.

పింఛనర్ల సంఘ సర్వసభ్య సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): ఆంధ్రప్రదేశ్ పింఛనర్ల సంఘ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశాన్ని భక్తవత్సలనగర్‌లోని పింఛనర్ల సంక్షేమ భవనంలో శుక్రవారం నిర్వహించనున్నామని సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్మెమ్ గౌస్, ఎస్వీవీఎస్ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదాయ పన్ను, ఈ – ఫైలింగ్‌పై చర్చించనున్నామని వివరించారు. పింఛనర్లు తదితరులు హాజరుకావాలని కోరారు.

శిథిలావస్థలో గ్రంథాలయం



దుస్థితిలో ఉన్న మనుబోలు గ్రంథాలయం

- పెచ్చులూడుతున్న శ్లాబ్
- ఆందోళనలో పాఠకులు

మనుబోలు : మనుబోలు గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో పాఠకులు ఆందోళన చెందుతున్నారు. గ్రంథాలయాన్ని నిర్మించి నాలుగు దశాబ్దాలు కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కురిస్తే పైనుంచి వర్షపు నీరు వెళ్లే మార్గం పూడిపోవడంతో నీరు నిల్వచేరి ఉరుస్తోంది. దీంతో శ్లాబు దెబ్బతిని తరచూ పెచ్చులూడి పడుతున్నాయి. పిల్లర్లు సైతం దెబ్బతిన్నాయి. గోడల్లో మొక్కలు పెరిగి అస్తవ్యస్తంగా ఉన్నాయి. పాఠకులు ఎక్కువగా బయట వరండాలో కూర్చుని చదువుకుంటున్నారు. ఇటీవల బయట వరండాలో ఇలాగే పెచ్చులూడి పడిన ఘటనలో త్రుటిలో పాఠకులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. గ్రామంలో పలు ప్రభుత్వ భవనాలు ఖాళీగా ఉన్నాయని, అధికారులు స్పందించి వాటిల్లో ఏదో ఒక దానిలో తాత్కాలికంగా గ్రంథాలయాన్ని నిర్వహించాలని గ్రామస్తులు సూచిస్తున్నారు. అలాగే గ్రంథాలయానికి కొత్త భవనాన్ని మంజూరు చేయాలని కోరుతున్నారు.



ఇటీవల వరండాలో పెచ్చులూడి పడిన శ్లాబ్ భాగాలు



దెబ్బతిన్న పిల్లర్

వేడుకగా తొలి ఏకాదశి



పొదలకూరు : ప్రత్యేకాలంకరణలో స్వామివారు



పొదలకూరు : లక్ష తులసీ దళార్చనకు హాజరైన మహిళలు

పొదలకూరు : పట్టణంలోని లక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకం, 9 గంటలకు లక్ష తులసీ దళార్చన చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, 7.30 గంటలకు పల్లకిసేవ జరిపించారు. ప్రత్యేక పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్థానిక అయ్యప్పనగర్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో..

పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, పూజలు జరిపించారు. ప్రజలు సుఖశాంతులతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. దేవస్థానం చైర్మన్ ఆదూరు వెంకటసుబ్బయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విష్ణాలయంలో..

మనుబోలు : స్థానిక శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవాలయం(విష్ణాలయం)లో తొలి ఏకాదశి పూజలను బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకుడు మాధవగిరి హనుమాచార్యులు సూర్యోదయానికి ముందే స్వామివారికి అభిషేకాలు జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం సుప్రభాత సేవ గావించి మంత్రోచ్చారణల మధ్య భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్నపన తిరుమంజనం, తులసీ దళార్చన జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలకు దివంగత చిట్టమూరు ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



మనుబోలు : ప్రత్యేకాలంకరణలో చెన్నకేశవస్వామి



మనుబోలు : భక్తులతో పూజలు చేయిస్తున్న అర్చకులు